
# రుమాలు

నికొండ హనుమంతరావు



మధ్యాహ్నం భోజనం చేసి నాలుగు గంటలు గాఢనిద్ర పోయి లేచి, బడలిక అంతా మాయమయేటట్లు సువాసనలు విరజిమ్మే సబ్బుతో హాయిగా స్నానం చేసి సింగారించుకొని పెళ్ళి కొడుకల్లే తయారయ్యాడు సాంబమూర్తి.

వయస్సునలభైరెండుదాటినాఅక్కడక్కడ వెండి తీగెల్లాటి వెంట్రుకలు మెరుస్తూన్నా, మనసుమాత్రం యింకా నవయవ్వనంలోనే ఉండటం ఒక్కొక్కప్పుడు అదృష్టమనిపించినా, ఈ యవ్వనపు కోర్కెలు తీరా విడుదలయే మార్గాలు నియమితంగా ఉంటూండటంవల్ల దురదృష్టమే అనిపిస్తూ ఉంటుంది సాంబమూర్తికి.

పదేళ్ళక్రితం భార్య చనిపోయాక - మళ్ళీ పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యమే రాలేదు. కావల్సినంత సంపాయించుకున్నాడు. గట్టి లాయరనే పేరు ప్రఖ్యాతులున్నవి. వృత్తి రీత్యాకూడా తగినంత ఇంటరెస్ట్ లేదు. ఈ సంపాయించింది ప్రజాసేవ చేసే ఏసంస్థకో దానం చేయాలని ఏ నా డో నిశ్చయించుకున్నాడు. ఒంటరి జీవితం ఒకొకప్పుడు బాధగా ఉన్నా, యి త రు ల ప్రస్తావన లేకుండా ఆ పడే బాధేదో తానొక్కడే పడే అవకాశం వున్నందుకు సంతోషమూ కలుగుతూ వుండేది.

తేలిగ్గా, సూక్ష్మంగా, పరిష్కరించుకునే సమస్యల నెన్నిటినో మానవుడు క్లిష్టతమం చేసుకొని నానా హైరానాపడటం ఆయన వృత్తిరీత్యా నిత్యా చూస్తూనే వున్నాడు. స్వల్ప విషయాలతో మా న వు డు బుర్ర బద్దలు కొట్టుకుంటూనే వున్నాడు. ఇలాంటి వాళ్ళను చూసి ఒకపక్క జాలి కలిగినా మరోవైపున వారి మౌఢ్యానికి వారు అనుభవించే బాధ తగిన వెలేనని అనుకుంటూ వుంటాడు. జీవితాన్ని 'రిసెర్చి స్కాలర్' వలె స్టడీ చేస్తూ వుండటం అలవాటైంది.

వారానికి ఒకరోజు సెలవుగా వచ్చి పడే యీ ఆదివారాన్ని దివ్యానుభవం పొందేందుకు కేటాయించాడు. ముఖ్యంగా ఈరోజు రాత్రిమాత్రమే పదేళ్ళక్రితం వరకూ తాను అనుభవించిన సంసార సౌఖ్యాన్ని అనుభవ పూర్వకంగా జ్ఞాపకం చేసుకుంటూవుంటాడు. ఈ అనుభవాన్ని తనకు ప్రసాదించేందుకు ఈ మహాపట్టణంలో అనేకులు వున్నా, తన అభిరుచులకు అనుగుణంగా వుండే యువతిని ఎన్నిక చేసుకోవటంలో సాంబమూర్తి అనుభవజ్ఞుడని రుజువు చేసుకున్నాడు.

ఐతే అనుకున్నది అనుకున్నట్లు జీవితంలో జరగకపోవటం కొత్తవిషయమేం కాదు. అనేక అవాంతరాలూ, మార్పులూ వచ్చి పడుతూనేవుంటవి. కొన్నిటిని తప్పించుకున్నా, మరికొన్ని బా ధ పె డు తూ నే ఉంటవి.

ఇవాళరాత్రి ఏడున్నరకే వస్తానని వాగ్దానం చేసిన సుశీల - పదకొండింటికి ఫోన్‌చేసి రాత్రి తొమ్మిదింటిదాకా తనకు డ్యూటీ వున్నదనీ, పదిగంటల లోపుగా వస్తాననీ చెప్పింది. ఇది చిన్న అవాంతరమే ఐనా ఆతృతతో వేగిపోయే తనను వేధిస్తూనే వున్నది.

రాత్రి పదింటిదాకా గడపటమెలా? బైటికి వెళ్ళబుద్ధికాలేదు. బంగళా తోటలో



పడక కుర్చీలో పడుకొని కాస్సేపు ప్రకృతి సౌందర్యాన్ని తిలకించాడు; ఐతే యిదికూడా 'బోర్' అనిపిస్తోంది.

ఎవరైనా - ఏ నవయవ్వనవతైనా వచ్చి కాస్సేపు కులాసాగా మాట్లాడితే బాగుండుననిపించింది. పని కట్టుకొని తనకోసం వచ్చేవారెవరు?

బంగళాకు కాపలాగావున్న ఘూర్ఖా వచ్చి సలాంచేసి, "తమతో మాట్లాడాలని ఎవరో ఒకామె వచ్చింది సార్!" అన్నాడు.

ఒక్కొక్కప్పుడు అనుకున్నట్టే జరుగుతుంటుంది! ఐతే యీ వచ్చినామె తన ఊహాసుందరికి దరిదాపుల్లోకూడా వుండి వుండకపోవచ్చు. ఏమైనా వున్నంతలోనే తృప్తిపడే తత్వం తనది కనుక బాధేమీ లేదు.

"సరే - యిక్కడికే తీసుకొనిరా -"

ఘూర్ఖా వెళ్ళిపోయాడు. అ రాబోయే ఆమెకోసం సాంబమూర్తి యెదురుతెన్నులు చూడసాగాడు.

మలుపులో మెరుపు మెరిసినట్లయింది. తీవ్రంగా చూడటం సంస్కారానికి విరుద్ధమని తెలిసినప్పటికీ, ఆమె మీద నుంచి సాంబమూర్తి తన కళ్ళను మరల్చలేకపోయ్యాడు.

ఇరవై, ఇరవైరెండేళ్ళవయస్సుంటుంది; నిగనిగలాడే బంగారురంగు శరీరచ్ఛాయ; సన్నగా, పొడుగ్గా ఉత్సాహం తొణికిసలాడుతూ, నడకలో వయ్యారం, హుందాతనం వెల్లివిరుస్తోంది. తీర్చిదిద్దినట్లున్న కనుముక్కుతీరు; బాగా చదువు సంస్కారాలున్నట్లుతెలియజెప్పే కాంతివంతమైనకళ్ళు. దేవత్వమున్న వ్యక్తి శాపకారణంగా భూమిమీద అవతరించిందా అనిపిస్తోంది. చేతిలో హాండ్‌బ్యాగ్‌ను మెల్లిగా ఊపుకుంటూ వినపడని సంగీతానికి అడుగులు తాళంవేస్తున్న

విధంగా తనవైపు వస్తోంది. నీలంరంగు శాటిన్ షావడామీద నీలంరంగు సిల్కు చీరె. నీలం జాకెట్టూ. మెడలోని సన్నని గోవర్ధనపు గొలుసు రొమ్ములమీద నాట్యమాడుతూండగా చిరునవ్వులు చిలకరించుకుంటూ, సుఖసౌఖ్యాలు తనహక్కు భుక్తం అనే ధోరణిని వ్యక్తపరుస్తున్నది. ఇంత అందమైన చందనపు బొమ్మలాటి కొమ్మకు — కోర్టులతోనూ, లాయర్లతోనూ, పనేమిటో!

సాంబమూర్తి ఆలోచనలు పూర్తికాకముందే ఆమె ఆయన ముందున్నది. చప్పున తెలివితెచ్చుకొని పక్కనున్న సిమెంట్ కుర్చీని చూపాడాయన. ఆమె వయ్యారంగా కూర్చొని సాంబమూర్తివైపు చూసింది.

"చెప్పండి —" అన్నాడు సాంబమూర్తి వ్యాపార ధోరణిలో.

"నాకు విడాకులు కావాలి —" అన్నదామె అదే ధోరణిలో.

సాంబమూర్తి ఒక్కక్షణం నివ్వెరబోయాడు; మరు క్షణంలో ఆయనదృష్టి ఆమె రొమ్ములమీద వాలింది. మెడలోవున్న పసుపుతాడు సన్నటిది జాకెట్‌లోకి మాయమవటం గమనించాడు. ఇంతటి అందంగల ఆడదాన్ని బాధించిన ఆ భర్తగాడిమీద ఆయనకు కోపం వచ్చింది. ఈమెకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకోనిదే యేమీ నిర్ణయించలేడు. అన్నిటికన్నా ఆమె సిగ్గుపడకుండానే- కాలయాపన లేకుండా జంకూ, గొంకూ లేకుండా తనకు కావలసిందేమిటో సూటిగా చెప్పటాన్ని సాంబమూర్తి మెచ్చుకొని, ఆమెపట్ల యేర్పడిన అభిమానానికి మరోమారు కలిపాడు.

ఇలాటి చిత్రమైన కేసు (?) తనకు కొత్తే ఐనప్పటికీ దీని అంతేమో చూడాలనిపించింది: ఈమెను కొంచెం ఏడిపించి, సరదాగా కాలక్షేపం చేయాలనికూడా అనిపించింది - సాంబమూర్తికి.

"కారణాలు కావాలి. మీ భర్త నపుంసకుడా?"

సూటిగా అడిగిన యీప్రశ్న కోర్టులో క్రాస్‌ఎగ్జామినేషన్‌లో అవతలి క్లయింట్‌ను చికాకు పెట్టేందుకు ప్రయోగించేది: అలాటిదాన్ని ఆమెమీద - తన క్లయింట్‌మీద, ముట్టమొదటే విసిరిపారేశాడు సాంబమూర్తి!

"ఉహూం." అన్నదామె సూటిగా సాంబమూర్తిని చూస్తూ.

"ఐతే చిన్నతనంలోనే - వివాహబుద్ధి తెలియక పూర్వమే యీపెళ్ళి ఐందా?"

"కాదు -"

"మీ ఆయన రోగిష్టా? నేరస్థుడా? మిమ్మ అనవసరంగా శారీరకంగా కానీ, మానసికంగా కానీ క్షోభ పెడుతున్నాడా?"

విడాకులు కోరదగిన కారణాలను ఊహించి ఒక్కసారే ప్రశ్నలవర్షం కురిపించాడు సాంబమూర్తి.

"అవేవీ కావండీ! .... మీరు అసలు కథ వినాలి—" అన్నదామె.

దాంతో సాంబమూర్తి చిలిపి ప్రశ్నలకు అవకాశం లేకుండా పోయింది. ఏమైతేనేం- ఆమె చెప్పబొయ్యే కథ ఎంటర్‌టైనింగ్‌గా వుండగలదని తోచింది.

"కానీండి .... చెప్పండి!" అన్నాడు సాంబమూర్తి పడకకుర్చీలో సుఖంగా వెనక్కు వాలి.

"ఇప్పుడు నావయస్సు 21 సంవత్సరాలు. మూడేళ్ళక్రితం నాకు ప్రభాకర్‌తో పెళ్ళయింది—"

'మిసి మిసి యవ్వనంలో 'మిస్' చెర విడిపించుకొని బైటపడ్డావన్నమాట!' అనుకున్నాడు సాంబమూర్తి.



"మే మిద్దర్ణమూ కాలేజీలో చదువుకుంటూన్నప్పుడే ప్రేమించి పెళ్ళిచేసుకున్నాం!" అన్నదామె.

'మరింకేం? ఏమైనా పొరపాటు పడివుంటే మేజర్‌గా వున్నప్పుడు జరిగింది కనుక బాధ్యత నీదే అవుతుందే!' అనుకున్నాడు సాంబమూర్తి.

"ఆర్థికసంబంధమైన సమస్య లేమన్నా వున్నయ్యా?" అని అడిగాడు సాంబమూర్తి.

"ఆయన మరీ అంతలేనివాడేం కాదు. ఏటా నాలుగువేల ఆదాయం వున్న ఆస్తి వున్నది. తల్లిలేదు - తండ్రిమాత్రం బతికే వున్నాడు. ఒక్కడే కొడుకు—"

'ఇంత హాయిగా వుండే కుటుంబ వాతావరణం యీమెకు యెందుకు సరిపడలేదా?' అని ఆలోచిస్తున్నాడు సాంబమూర్తి.

"ఆయనకు ఇంగ్లండ్‌లో ఉద్యోగం—"

"ఏం ఉద్యోగం - జీతం యెంత?" అన్నాడు సాంబమూర్తి.

"చెబుతున్నాగా! బి. బి. సి. లో ఎనౌన్సర్. జీతం నెలకు నూటఇరవై పౌనులు, అంటే దాదాపు 1800 రూపాయలు. నెల నెలా ఆయన నాకు ఏడొందలయాభై దాకా పంపుతుంటారు!"

'ఇంకేం రోగం?' అనుకున్నాడు సాంబమూర్తి.

"ఆర్థికమైన యిబ్బందులేమీ లేవనుకోండి" అని నసిగిందామె.

"అక్కడ మీ ఆయన కేమైనా ప్రియురాలు ఉన్నదా?" అని అడిగాడు సాంబమూర్తి.

"ఆయన అలాటివారు కారు!"

'మరి అలాటి అనుమానానిక్కూడా ఆస్కారం లేకుంటే యింకొక కారణం - తాను ఊహించేందుకు గుంజుకుంటూన్నది ఏమై వుండునో?' అని ఆలోచిస్తున్నాడు సాంబమూర్తి.

"మీరుకూడా ఇంగ్లండ్ వెళ్ళివుండేందుకు యిబ్బందులేమిటి? మామగారైన ముసలాయనా?" అని అడిగాడు సాంబమూర్తి.

"ముసలాయన గొడవ మా ఎవరికీ పట్టదు. ఆయన ఆయన చెల్లెలిగారింట్లో వుంటారు. నెలకు 200 రూపాయలు పెన్షన్ వస్తుంది. దాంతో ఆయనసుఖంగావున్నారు."

"ఇంకేం - మరి యిబ్బందేమిటీ?"

"నాకు పాస్‌పోర్ట్ తీసి యునైటెడ్ కింగ్‌డమ్‌లో వుండేందుకు యేర్పాటుకూడా చేశారాయన. అక్కడ ఆయన స్నేహితులు నాకు ఉద్యోగం కూడా ఇప్పిస్తామని గట్టిగా చెప్పారట!"

"ఇంతకన్నమంచి ఆర్థికసౌభాగ్యమున్న దేశంకదా! వెళ్ళి హాయిగా ఉండవచ్చునే!" అన్నాడు సాంబమూర్తి.

"ఏమో స్వదేశం వొదలి వెళ్ళటం నాకు ఇష్టంలేదు." ●

"అదేవిధంగా మీ ఆయనకు ఇంగ్లండ్ వొదలి రావటం ఇష్టంలేదా?"

"మొత్తం నాలుగేళ్ళ కాంట్రాక్టు ఉద్యోగం అది. మరోరెండు సంవత్సరాలు ఉంది. బహుశా తరువాతకూడా యీ ఉద్యోగం కంటిన్యూ అవుతుంది. ఆ తర్వాతి సంగతి ఏలా ఉన్నా యీ రెండేళ్ళూ ఎలాగో గడిపి

---

● మూడేళ్ళ కొడుకుతో తల్లి: "మా నాయనగా, మంచివాడివి, కాస్త నీ నాలిక చూపించు. డాక్టరుగారు నీ నోట్లోంచి వేలు తీసుకుంటార్ట"

ఇండియాకు వస్తానని తెలియ పరిచారాయన!"

"మరి ఇంతలోనే మీ రెందుకు తొందర పడ్డారు?" అన్నాడు సాంబమూర్తి.

"ఆయన పరంగా మీరు అడిగిన ప్రశ్నలు నా పరంగా మీ రెందుకు అడగలేదు?" అన్నదామె.

సాంబమూర్తి నిర్ఘాంత పొయ్యాడు. తననే క్రాస్ ఎగ్జామిన్ చేయగల సామర్థ్యమున్న యీమెను చూసి తాను ఊహించిన దానికన్న తెలివిగల ఘటమని అర్థం చేసుకున్నాడు. ఏ ప్రశ్నలైతే తాను అడిగి ఆమెను నొప్పించటమెందుకని ఊరుకున్నాడో, ఆ విషయంలోనే ఆమె ఒక సవాల్ విసిరింది. లేక ఆ క్లిష్టమైన విభాగాలన్నా తాను గ్రహించగలడోలేదో నని ఒక పరీక్ష పెట్టిందా? ఏమైనప్పటికీ కొద్ది క్షణాల్లోనే సాంబమూర్తితలలో ఆ ప్రశ్నలు మెరుపుల వలె మెరిసినవి.

"బహుశా మీ వివాహమైన మరుసటి సంవత్సరంలోనే ఆయన ఇంగ్లండ్ వెళ్ళి ఉంటాడు. ఆయన వెళ్ళటం మీకు ఇష్టమై ఉండదు: మరోవైపున ఆయన సంపాదనను గూర్చి ఉభయులూ ఆశపడి ఉండాలి. లేదా ఆయన పరదేశానికి వెళ్లాక ఒంటరి తనం మీకు భరించరానిదై ఉండాలి!"

ఆమె చిరునవ్వు నవ్వింది.

"ఆ వయస్సులో దీర్ఘకాల వియోగంతో మీరు యమబాధ పడి ఉండాలి. మరో మార్గం లేక మీరొక ప్రియుడ్ని కూడా సంపాయించి ఉండాలి" అని ఆమె వైపుచూశాడు సాంబమూర్తి.

"మీ గ్రాహ్యశక్తికి జోహారులు!" అన్నదామె తళతళలాడే చూపులతో.

"మీ కేమైనా సంతానమా?"

గురిచూసి వేసిన ప్రశ్నలా భావించిందామె.

"ఒక కూతురు, సంవత్సరం నిండింది."

"ఇప్పుడు యీ సంతాన ప్రతి బంధకం కూడానా?"

"అదీ అంత పెద్ద సమస్యే కాదు. కావాలంటే అమ్మాయి ఆయన దగ్గిరే పెరుగుతుంది. ఆర్థికమైన క్లిష్టసమస్యలూ లేవు--"

"మరొక భర్తను ఎన్నిక చేసుకొనే ఉంచావన్నమాట!" ఇంతవరకూ వచ్చాక యీమెను ఏకవచనంలోనే సంబోధించటం సమంజసమని సాంబమూర్తి నిశ్చయించుకున్నాడు.

ఆమెకు ఆ భేదం తెలియలేదు: లేక తెలిసినా లక్ష్యపెట్టలేదేమో?

"బాగా దూరం ఆలోచించుకున్నావా?"

"ఆఁ, జీవితంలో మార్పు కావాలి. వెరైటీ లేని జీవితం నిస్సారం. చాలాసేపు ఏవ్యక్తీ తనను తానే భరించలేడు. అందుకనే జైలు జీవితం దుర్భరమనిపించేది. అందునా యవ్వనాన్ని దాచుకొని ప్రయోజనంలేదు: అది ఆ వ్యక్తినీ తదితరుల్నీ కూడా బాధిస్తుంది: అలాగే మురిగి, కుళ్ళి నాశనమౌతుంది. దాన్ని పంచుకుంటూ యీ భూమి మీద అనుభవించ దగినదంతా అనుభవించటం నా ఆశయం!"

"వేశ్య చెప్పవలసిన వాదమిది!" అనుకున్నాడు సాంబమూర్తి. ఆమె ఆశయమేమిటో ఆయనకు బాగా అర్థమైంది. ఏం చెపితే బాగుంటుందో, ఆయన ఇంకా తేల్చుకోలేదు.

"ఇదేమంత క్లిష్టమైన కేసుకూడా కాదు. మా ఆయనకు అంతా తెలిసింది." అన్నదామె.

"ఆయన నీకు విడాకులివ్వక మునుపే ఆ గౌరవాన్ని నీవు దక్కించుకుంటే బాగుంటుందనా?"

"ఉహుఁ, విడాకులు కోరే పక్షంలో ఆయన కంటెస్ట్ చేయనని రాశారు. ఎక్స్‌పార్టీ డిక్రీ అవుతుంది. లేదా కోర్టువారికి ఆయన తన అంగీకారాన్ని తెలియ పరుస్తారు. ఎక్కువగా శ్రమ పడనవసరం లేదు."

ఫీజు విషయమై ఆమె ఆందోళన పడుతోందా అనే సందేహం కలిగింది సాంబమూర్తికి. బహుశా అదై వుండదు. ఇలాటి కేసును చాలా తక్కువ ఫీజుకు తీసుకొనే జూనియర్స్ కోకొల్లలుగావున్నారు. ఎక్కువ రభసలేకుండా తేలిగ్గా తెలివిగా పనిపూర్తి చేసుకునేందుకే ఆమె తనదగ్గిరికి వచ్చిందని అనుకున్నాడు సాంబమూర్తి.

"ఈ కోర్టులూ మిగతా ఫార్మాలిటీస్ మటుకు చూస్తే సరిపోతుంది" అని ఆమె తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

"తరువాత భర్త సిద్ధంగావున్నాడా?"

"ఆఁ" అందామె, నిస్సంకోచంగా.

"మీ ఆయన రాసిన ఉత్తరాలేమన్నా వుంటే యివ్వు."

"ఇవిగో - ముఖ్యమైన నాలుగు ఉత్తరాలూ—" అని ఆమె హ్యాండ్‌బాగ్‌లోంచి గళ్ళ సిల్కురుమాలులో కట్టబడిన చిన్న కట్టను సాంబమూర్తికి అందించింది. రుమాలు మీదినుంచి సెంటువాసనల ఘుమఘుమలు గుబాళించినవి.

"సరే-రేపు సాయంత్రం ఐదు గంటలకు యిక్కడకు రా. వొచ్చేటప్పుడు నీవు వివాహ మాడదలుచుకున్న ఆ 'భర్త'ను కూడా వెంట తీసుకొని రా. నా క్లయింట్‌గా నీకు ఎలాటి కష్టమూ, నష్టమూ కలగకుండా చూడవలసిన బాధ్యత నా కున్నదిగదా! విషయాలన్నీ ముగ్గురమూ కూర్చొని మాట్లాడుకోవటం మంచిది"

"తమ ఫీజు?"

"ఇప్పుడేం అవసరంలేదు. ఆ సంగతి కూడా రేపు సాయంత్రం చెప్తాను—"

ఆమెలేచి సుతారంగా 'టా - టా' చెప్పినట్లుగా కుడిచేయి పైకెత్తి వయ్యారంగా నడిచి వెళ్ళింది. సాంబమూర్తి రుమాలుమీది సువాసనల్ని ఆఘ్రాణిస్తూ ఆమె వెళ్ళే వైపు చూడసాగాడు.

## 2

రకరకాల ఆలోచనలు సాంబమూర్తిని చుట్టుముట్టినవి. ఈ వచ్చి వెళ్ళిన విచిత్ర వనిత మనస్తత్వం ఆయనకు అంతుబట్టలేదు. పేరేమిటో, చిరునామా ఏమిటో కూడా తను అడగలేదు. ఆమె యిచ్చిన ఉత్తరాలద్వారా యీ విషయాలు తెలుసుకునే అవకాశం వున్నది. వృత్తిరీత్యా కాకపోయినా ఈవిచిత్రవ్యక్తిత్వాన్ని తెలుసుకోవాలనే కుతూహలం సాంబమూర్తిలో ప్రబలింది.

సత్కాలక్షేపానికి చేతులోవున్న ఉత్తరాలకట్ట వుండనే వున్నది. బంగళాలోకి వెళ్ళి భోజనంచేసి సుఖంగా పడుకొని ఉత్త

● జడ్జి: "ఏమయ్యా, నమ్మిన వాళ్ళని ఇలా మోసం చెయ్యొచ్చా?"
ముద్దాయి: "నమ్మని వాళ్ళని మోసం చెయ్యడం ఎలాగండి?"

రాలు చదవసాగాడు - సాంబమూర్తి. సుశీల వచ్చేందుకు మరో గంటన్నర పడుతుంది! ఈలోగా యిదో కాలక్షేపం!

ఆగంతుకురాలు చాలా తెలివిగలదని తాను నిర్ణయించుకున్నాడు. ఆమె తనకిచ్చిన ఉత్తరాలలో ఆ తెలివి కనిపిస్తూనేవున్నది. అనవసరపు కాలయాపన జరగకుండా, తాను చికాకు పడకుండా-ఎంతవరకూ అవసరమో అంతవరకే ఉత్తరాలు యివ్వబడినవి. పోతే తన బంగళాకు దాపులోనే ఆమె నివాసం! అందుకనే తన దగ్గిరికి వచ్చిందీ కేసు!

మొదటి ఉత్తరంలో ఇలా వుంది:

లండన్.
6—1—1959.

డియర్ రేవతీ!

నీవూ, అమ్మాయీ కులాసాగానేవున్నారనుకుంటాను. ఇక్కడ చలి విపరీతం. మరో రెండేళ్ళు ఎలాగో ఓపిక పడితే సుఖంగా జీవనం గడిపేందుకు సరిపడే ధనసంపాదన పూర్తవుతుంది. నీవుసహకరిస్తావనే ఆశకూడా వున్నది.

నా స్నేహితులు కొంతమంది ద్వారా చిత్రవిచిత్రమైన వార్తలు వింటున్నాను. వాటిని నమ్మేముందు నీ జవాబుకూడా తెలుసుకోవటంఉచితమనిభావిస్తున్నాను.

బాధ్యతారహితంగా,ముక్కు మొహము ఎరుగని మొగాళ్ళతో తిరుగుతున్నావని తెలుస్తోంది. నీకంతగాకాలక్షేపంలేకుంటే నీ స్నేహితురాండ్రున్నారు కదా! లేదా లేడీస్ క్లబ్‌లు ఉన్నవి. అదీకాదంటావా- లోగడ ఉద్యోగంచేయాలనే కోర్కెను వెలిబుచ్చావు. నా స్నేహితులకు రాసి ఏదైనా ఉద్యోగం చూడమంటావా?

చాలా ఆధారపడ దగిన తావులనుంచి నాకీ ఉత్తరాలు వస్తున్నవి. నీ శీలాన్ని శంకించటంలేదు. అయితే సమాజాన్ని కూడా మనం గమనించవలసి ఉన్నది. కేవలం ఎవరి ఇష్టానుసారంగా వారు ప్రవర్తిస్తేసామాజిక శాంతి - ముందుగా కుటుంబ శాంతి నాశనమౌతుంది. చదువుకున్నదానివీ,తెలివిగల దానివీ - నీకువివరించి వ్రాయనవసరం లేదనుకుంటాను. మించిపోయింది లేకుంటే ఇప్పటికైనా కుటుంబ క్షేమ దృష్ట్యా వాంఛనీయమని జాగ్రత్తపడటం భావిస్తాను.

విశేషాలతో వెంటనేజవాబురాయి. ఈ కవరులో 50 పౌనులకు డ్రాఫ్ట్ పంపుతున్నాను. సుమారు రు 700 వస్తుంది. సాధ్యమైనంతవరకూ ఖర్చులు తగ్గించు. అమ్మాయికి ఏలోటూ రానీకు.

నీ
— ప్రభాకర్.

ఈ ఉత్తరానికి ఏధోరణిలో రేవతి జవాబు రాసి ఉంటుందో, ఆమె ఇచ్చిన రెండో ఉత్తరంలో తేటతెల్లమౌతున్నది.


లండన్.
19—1—1959.

డియర్ రేవతీ!

నేనిక్కడ కులాసాగానే వున్నాను. నీవూ అమ్మాయీ క్షేమమని తలుస్తాను.

నేను ఆశించిన విధంగా గాక సరిగ్గా అందుకువిరుద్ధంగావున్న ఉత్తరం,నీదగ్గిర్నుంచి వస్తుందని నేను కలలోకూడా తలచలేదు. నీస్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగకరంగావుండే విధంగా నేనెన్నడూ ప్రవర్తించలేదు:అలాటిధోరణి నీకుతోచినందుకు విచారిస్తున్నాను. నీ ఇష్టానుసారంగా తిరిగేందుకు నానుంచి యెలాటి అనుమతీ అవసరంలేదన్నావు. ఇదివరకు అంటే మన వివాహానికి పూర్వంవలె






విచ్చలవిడిగా తిరుగులాడే అవకాశాలు లేవనే నేనుతలపోస్తున్నాను. ముఖ్యంగా మన యిద్దరి జీవితాలూ మరొక చిన్న ప్రాణితో లంకెపడి వున్నవి.

కేవలం నా స్వార్థాన్నే నేను చూసుకోలేదు. కుటుంబక్షేమమే నాంత్యమనినీకు తెలుసు. నిన్ను విడిచివుండటం నాకెంత బాధాకరమో వేరుగా చెప్పనవసరంలేదు. ఐతే కొన్ని సుఖాలను పొందేందుకు మరికొన్నిటిని బలిపెట్టవలసే వుంటుందికదా!

యవ్వనం ప్రశాంతిని యిచ్చేదీకాదు; దాచుకుంటూంటేఉండేదికాదు. అనుభవించినా, అనుభవించక పోయినా కాలగమనంలో హరించుకొనేపోతుంది.అందుకని దాన్ని దుర్వినియోగం చేయటం మాత్రం ఏం సబబు? దాహమైనదని మురికినీళ్ళు తాగుతామా? ఇప్పటికైనామించిపోయింది లేదనే నేను తలుస్తున్నాను.

కోర్కెలు వుండటం సహజమే! ఆ కోర్కెల్ని తీర్చుకోవటమూ సహజమే: ఐతే ఇందుకుగాను అనుసరించే విధానాలు మనసంస్కృతిమీదా, తెలివితేటలమీదా, విజ్ఞానంమీదా ఆధారపడి వుంటవి. ఒకానొక వ్యక్తిని ఖూనీచేసినందువల్ల లక్ష రూపాయలు వస్తాయంటే-ఆపని చేయగలమా? కోర్కెలకు కేవలం దాసిన కాకుండా, వాటిని సాధ్యమైనంతవరకూ అదుపాజ్ఞల్లో పెట్టుకోవటం సామాజిక శాంతిభద్రతలదృష్ట్యా, సౌశీల్యాన్ని కాపాడుకోవటం చూపదగిన ఓర్పుదృష్ట్యా ఎంతైయినా అవసరం. ఇది జరగనినాడు మనకూ కుక్కలకూ వుండే భేదం అత్యల్పం.

నీ మనసు కష్టపెట్టాలనే ఉద్దేశంతో నేనీ విధంగా వ్రా[illegible]లేదు. మరొకసారి ప్రశాంతంగా [illegible]ంచగోరుతాను. పొరపాటునకాలుజా[illegible]మనేదాన్ని నేను అర్థం చేసుకోగలను. కాని కావాలని. పరిస్థితులను తనకు అనుకూలంగా రూపొందించుకొనే దురభిప్రాయంతో మాటిమాటికీ

కాలు జారుకోవటమనేది - ఒక అలవాటు - ఆతరువాత ఒక వ్యసనమౌతుందనే విషయం వేరుగా వివరించనవసరం లేదు.

ఈసారి ఉత్తరంలోనన్నానన్ను అర్థం చేసుకొన్న ధోరణి కనిపిస్తుందని ఆశిస్తున్నాను.

నీ

— ప్రభాకర్.

గారాబంగా పెంచబడిన భాగ్యవంతుల బిడ్డ చెడుమార్గాలను అనుసరించినప్పుడు, తల్లిదండ్రులు మంచిగా యెంతచెప్పినా వాడి చెవికి ఎక్కని ధోరణిలో రే వ తి జవాబు వ్రాసి వుంటుందనే విషయం అర్థమైంది. తాను వ్రాసిన ఉత్తరాల కాపీలు యివ్వకుండా, తన భర్త వ్రాసినవే యివ్వటంలో వున్న రహస్యంకూడా సాంబమూర్తి తెలుసుకోగలిగాడు. కేసు జరుగుతే ఎవరికివారు తమకు మాత్రమే అనుకూలంగా వుండే విషయాలను ప్రమాణంచేసి చెపుతారు. ప్రతికూలంగా వుండే వాటిని విస్మరిస్తారు; లేదా అలా నటిస్తారు! ఐతే కనిపించకుండా రహస్యంగా వుంచబడిన భాగాలు యధాతథంగా బైటికి లాగగల సమర్థులైన లాయర్లు కోర్టులో వుంటారని ఆమె అనుకొని వుండదు!

మూడో ఉత్తరం చదివాడు సాంబమూర్తి.

లండన్.

6—2—1959.

డియర్ రేవతీ!

నే నిక్కడ కులాసాగానే వున్నాను. నీక్షేమాన్ని నీ ఉత్తరంద్వారా తెలుసుకున్నాను.

ఈ ఉత్తరమన్నా నాకు మనశ్శాంతినిస్తుందని ఆశించాను. క్రితంసారి ఉత్తరంలో కన్నా దిగజారిపోయావనే విషయాన్ని యీ ఉత్తరం స్పష్టపరుస్తోంది. నేను విశదీకరించిన విషయాలు నీమనసునెందుకు విరిచివనో తెలియటంలేదు.

మనమధ్య యేర్పడిన అభిప్రాయభేదాలు యింత త్వరితగతిని అంతులేని అఘాతాలను ఏర్పరుస్తవని నే నెన్నడూ అనుకోలేదు. కోరింది లభ్యంకానప్పుడు అంతకన్నా తక్కువది దొరుకుతే వదలలేని మానవ స్వభావం కూడా నాకు తెలుసు. ఏదో ఒక సిద్ధాంతానికి అనుగుణంగా జీవితాన్ని నడుపుకోవటం జరగాలా? లేదా మనప్రవర్తనను సమర్థించుకునేందుకు ఏదో ఒక సిద్ధాంతాన్ని యెత్తి చూపుకుంటామా? చెడుపనులని తెలిసివుండే, వాటిని చేసేవారందరూ తమకు తాము సమర్థించుకునేందుకు ఏదో ఒక సిద్ధాంతాన్ని, తమ ప్రవర్తనకు అనుకూలమైనదాన్ని ఏరుకుంటారు. ఇదే సిద్ధాంతరీత్యా యిక్కడ నేను కూడా నా ఇష్టాను సారంగా, నేను తృప్తిని ఆశించి, ఎవత్తెతోనో సుఖపడటాన్ని నీవు భరించగలవా?

పోనీ నీవుకూడా ఇక్కడికి వచ్చేందుకు గాను తగిన ఏర్పాట్లన్నీ చేస్తాను. రాకూడదా? అప్పుడీ సమస్యల పరిష్కారం సులభసాధ్యమౌతుందికదా!

రేవతీ! మనది 'ప్రేమపెళ్ళి' అని నీవు మరిచిపోలేదనుకుంటాను. ఏరికోరి పెళ్ళాడిన వారి జీవితాలు కూడా ఇలా ఐతే సమాజంలో ఆదర్శంగా భావించబడుతూ, అభ్యుదయ భావాలుగా గుర్తించబడే ప్రణయంమీద ఎవరికైనా గౌరవం వుంటుందా? సనాతనాచారాలు ఒక్కసారిగా ఎదురు తిరిగి విజయనాదాలు చేయవా? ప్రేమించుకొనిపెళ్ళి చేసుకోవటమే ఉత్తమ మార్గమనేది మిధ్య అవుతుంది కదా! ఈవిషయాలు కూడా ఆలోచించు.

నీ ప్రవర్తన నాకు నచ్చకుంటే విడాకులున్నవనే విషయం జ్ఞాపకంచేశావు. మనం విడాకులు పొందినట్లయితే ఉభయుల వంశగౌరవము నేలపాలవుతుంది. అలా కాకుండా నీ ప్రస్తుత ధోరణిని మార్చుకోక పోయినా జరిగేదీ అదే! ఇలాంటి విషమ పరిస్థితుల్లో విడాకులే శరణ్యమనిపించేట్లు చేజేతులా చేసుకుంటున్నావు. అయితే మన అమ్మాయి సంగతేమిటి? నేనా పిల్లను వెనువెంటనే ఇంగ్లండ్‌కు తరలించి సాకటం కుదరదు కదా! చివరి ఆయుధంగా వున్న విడాకుల్ని నీవు త్వరపడి సందర్భశుద్ధి లేకుండా యిప్పుడే ప్రయోగించదలిచినట్లు భావిస్తున్నాను. నా ఊహలతో నీకు నిమిత్తం లేదనే ధోరణిని కనబరుస్తున్నావు కనుక వాటిని లెక్కచేయవనే అనుకుంటున్నాను.

మరొక్కసారి - బహుశా చివరిసారే కావచ్చు - ఆలోచించు. ఎవరో నీమీద మత్తుమందు చల్లినట్లుగాప్రవర్తిస్తున్నావు. తీవ్రమైన వాంఛలకు కళ్ళు బైర్లు కమ్మటంతో దానికి 'ప్రేమ' అనీ 'ప్రణయం' అనీ పేర్లుపెట్టి, అపవిత్రంగా భావించబడే ఆ పదాలవెనుక దాక్కోవాలని చూడటం కుటిల స్వభావమే అవుతుంది. నిన్ను నీవు మరిచేట్లు చేయగలిగిన ఆ ప్రణయాన్ని ఏ వెలయినా సరే చెల్లించి ఆరాధించేందుకే, నీవు నిశ్చయించుకున్నట్లు కూడా అర్థంచేసుకున్నాను. నీ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకునేందుకు ఎదురైన యీ విషమ పరిస్థితినే నీవు ఎన్నుకున్నావు. ఇకముందైనా నీకు జీవితంలో సుఖ సౌఖ్యాలు కలగాలని గాఢంగా ఆశిస్తున్నాను.

ఎటుతిరిగినా అపాత పాటే నీవు పాడదలుచుకున్న పక్షంలో - నీవు కోరే విడాకులకు నేను ఎదురుచెప్పను. నీవు కోర్టుకు వెళ్తే నేను అసలు కోర్టుకిరాను. ఇందువల్ల అవబోయ్యేదాన్ని మనం ఆపలేకపోయినా అనవసరపు కాలయాపనా, వాదోపవాదాలూ మొదలైన వేదనలను తప్పించుకోవచ్చు.

చివరకు నేను కోరేదేమంటే - నీవు పోనీ నీ ఇష్టానుసారంగానే తిరుగు. నేను ఇండియాకు వచ్చేంతవరకూ పిల్లను జాగ్రత్తగా పెంచు. మన కలతల కారణంగా బేబీ మనస్సు పాడుచేయవని నమ్ముతున్నాను.

ఈ కోరికనుకూడా నీవు మన్నించలేకుంటే - మరొక ఏర్పాటు చేసేవరకైనా ఆగుతావని ఆశిస్తున్నాను.

జవాబు వ్రాయి.

నీ

— ప్రభాకర్.

---

● వ్యవసాయ కళాశాలలో బి. ఎస్‌సి. చదువుతూ సెలవుల కింటికి వచ్చిన విద్యార్థి చెల్లెలితో— "ఏమిటీ మన గులాబిచెట్టు ఇలా ఎండిపోతుంటే చూస్తూ వూరుకున్నారు?"

చెల్లెలు: "అది గులాబికాదు, మందారచెట్టు"

సాంబమూర్తి రక్తంవేడెక్కింది. శాస్త్ర సందు దొరికితే మంచితనానికి పట్టే దుర్గతి, వేదనల స్వరూపాలు యెలాటివో ఆయన స్పష్టంగా చూస్తున్నాడు. ఇక ఆ నాలుగో ఉత్తరంలో ఏముంటుందో ఆయనకు చదవకుండానే తెలిసిపోయింది. ఐనప్పటికీ కథాక్రమంకోసం, రేపు తానివ్వబొయ్యే సలహా సర్వాంగీకారంగానూ, శాస్త్రసమ్మతంగానూ వుండేనిమిత్తం ఆయన నాలుగో ఉత్తరాన్ని కూడా చదివాడు;

లండన్,
3.3.1959

డియర్ రేవతీ,

జవాబు వ్రాసేందుకు చాలా అలస్యం చేసిన కారణంగా నీమన సేమన్నా మారుతుందేమోననే ఆశను. నీ ఉత్తరం నిరాశ చేసింది.

చాలా కొత్త విషయాలు జీవితంలో తెలుసుకోవటం జరుగుతుంది. శరత్ బాబు కథల్లో లాగు 'భారత స్త్రీ ఒకే సారి ఒకే పురుషుణ్ని ప్రేమిస్తుంది' అనే సిద్ధాంతం కేవలం అదర్శప్రాయమైన కథారచనలకు మాత్రమే సరిపడే సత్యమని నీవు వెలిబుచ్చిన అభిప్రాయంతో నాకు ఎలాటి పేచీ లేదు; ఇతర పురుషులను కూడా అప్పు అంత గాఢంగాను ప్రేమించవచ్చు; ఐతే ఆ ప్రేమను ప్రకటించే అవకాశాలూ, సమాజపు అనుకూల వాతావరణమూ మొదలైనవి లభ్యపడనందువల్ల ఆమె తిరుగుబాటు చేయలేకపోతోందన్నావు. అదీ కాచి వడబోసిన సత్యమే;

నీ గాఢమైన వాంఛలను, చట్టసమ్మతంగానూ, నీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఎలాటి ఆటంకమూ లేకుండానూ తీర్చుకొనే ఏర్పాట్లు చేసుకున్నావన్నావు. నీ కుశాగ్ర బుద్ధికీ, చాకచక్యానికీ అభినందిస్తున్నాను. విడాకులు తీసుకోకుండా విచ్చల విడి విహారంద్వారా నా మనసు కష్ట పెట్టటం నీకు ఇష్టంలేదన్నావు; నామీద యీ మాత్రం దయ చూపినందుకు ఆనందిస్తున్నాను.

విశేషించి వ్రాయవలసిందీ లేదు. తెగిన తాడుకు చెరో వైపునా దూరంగా విసిరి వేయబడటమే ఉభయులూ అందుకోవలసిన ప్రతిఫలం; బేబీ సంగతి నాకే వొదలినందుకు కూడా నీ వట్ల కృతజ్ఞుడ్ని. సరిగ్గా నెల రోజుల వ్యవధి ఇవ్వు. యీ లోగా బేబీ సంరక్షణ భారానికి ఏర్పాట్లు చేయ గలుగుతాను.

విడాకులు - కోర్టుద్వారా తేలిగ్గా పొందగలవు. ఏలాయరైనా యీ సంగతి నీకు చెప్పగలడు. నేను ఎటూ అడ్డగించను. ఈ ఉత్తరాన్ని నా అంగీకారంగా కూడా నీవు కోర్టులో దాఖలు చేయవచ్చు.

నీవు కోరే కొత్తజీవితం సుఖప్రదంగా గడుస్తుందని మనః పూర్వకంగా ఆశిస్తున్నాను,

నీ
— ప్రభాకర్.


సాంబమూర్తి నిట్టూర్చాడు. తెగించిన ఆడదాని కాళికాస్వరూపం ఆయన కళ్ళ ముందాడింది. ఎంతో అందమైన ఆడదాన్ని సాయంత్రం చూశాననే ఆనందమంతా ఆ అందానికి వెనుక దాగిఉన్న పగిలిన అగ్ని పర్వతాన్ని చూసేప్పటికి భయంగా మారింది. ఎంత తియ్యగా ఉన్నా, విషమని తెలిసి తినలేంకదా!

ఈ విచిత్రమైన మన స్తత్వమున్న వ్యక్తికి ఎలాటి సలహా ఇవ్వాలా అని ఆలోచిస్తూ, తనలోతాను ఎంతో గాఢంగా తర్కించుకుంటూ, తనకు తెలియకుండానే మగత నిద్రలో పడ్డాడు సాంబమూర్తి. సుశీల వచ్చి గట్టిగా ముద్దుపెట్టి మేల్కొల్పాకగాని ఆయన మనసుని ఆవరించిన మేఘం విడిపడలేదు.

## 3

మర్నాడు, సాయంత్రం సరిగ్గా ఐదు గంటలకల్లా రేవతి తన కాబొయ్యే భర్తను వెంటబెట్టుకొని సాంబమూర్తి ఆఫీసుగదిలో ప్రవేశించింది. ఆ గదిలో వెలిగే నాలుగు ట్యూబ్ లైట్స్ వెరసి మొత్తం 160 కాండిల్ పవర్, రేవతి అంచదందాలముందు వెలవెలబోయినట్లుంది.

"రండి - రండి!" అని సాంబమూర్తి వారిని ఆహ్వానించాడు; తమ కేసువిషయమే స్టడీచేసి సిద్ధంగా వున్నందుకు, భరించలేని కాలయాపనకు గురికానందుకు కాబొయ్యే వధూవరులిద్దరూ మనసులో ఎంతోఆనందించారు.



సాంబమూర్తికి ఎదురుగా వారిద్దరూ వెరో కుర్చీలోనూ కూర్చున్నారు.

"వీరు నారాయణరావుగారు .... నవలా రచయిత ...వీరాంధ్ర అనే తెలుగు దిన పత్రికలో అసిస్టెంట్ ఎడిటర్—" అని ఆ యువకుణ్ని రేవతి సాంబమూర్తికి పరిచయం చేసింది.

సాంబమూర్తి ఒక్కక్షణం ఆయువకుణ్ని పరిశీలించి చూశాడు. పాలుగారే బుగ్గలు చూసి కొత్తగా జీవితానుభవంలేని వాడనే విషయాన్ని గ్రహించాడు. కథలు చదివి కథలు రాయటంమాత్రమేనేర్చి ఉండొచ్చు. రేవతి వాలుచూపుల వలలో చిక్కుకొనే వేలాది ప్రజల్లో ఇతను ఒకడు. రేవతికి ఇతని మీద మమత కలగటం ఒక్కటే విశేషం. అందగాడూ. లేత వయసువాడూ అనేవి పైకి కనిపించే లక్షణాలు. అందుకని కాస్త లోతుకువెళ్ళవలసిన అవసరం ఉన్నదని సాంబమూర్తి భావించాడు.

"నీ అభిరుచుల్ని అభినందిస్తున్నాను రేవతీ!" అన్నాడు సాంబమూర్తి.

ఈ ఒక్క వాక్యంతోనూ వారుభయులు ఆనంద పారవశ్యాన్ని పొందిన సూచనలు సాంబమూర్తి తీవ్ర దృష్టికి తగిలినవి.

"సరే - బిజినెస్ చూద్దాం ..... రేవతి తన మొదటి భర్తకు విడాకులిచ్చి, మిమ్మ వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకున్న సంగతి తమకు తెలుసు కదా!"

"తెలుసు!" అన్నాడు నారాయణరావు.

"ఆమె విడాకులు కోరిన కారణం ఏమిటో తమకు తెలుసా? ఆమెకు మొదటి భర్త సంతానం తాలూకు ఒక ఆడపిల్ల ఉన్న సంగతి తెలుసా?"

"భర్తకూ తనకు పడటంలేదంది: తనకా భర్తమీద ఇష్టం తగ్గిందన్నది. తన బేబీని ఆ భర్తే తీసుకుంటాడని చెప్పింది."

"రైట్ ... ఆమె ఏమీ దాచలేదు. అయితే రేపు మీ మీదకూడా ఇష్టం తగ్గవచ్చు కదా!"

"రేపటి సంగతెందుకు లెండి!" అంది రేవతి కొరకొరలాడుతో.

ఆ జవాబును నారాయణరావు మెచ్చుకున్నట్లు కనిపించింది. "అంతే లెండి." అన్నాడు.

"నిన్నటి విషయం, రేపటి విషయాలూ వొదిలేద్దామంటే - కేవలం వర్తమాన కాలానికి విలువ ఏమీ ఉండదని నా భయం. ఎందుకంటే నిన్నటి అనుభవం మీదా, రేపటి ఆశయాలమీదనే వర్తమానం ఆధారపడి ఉంది. వర్తమానమంటే కేవలం యీ రోజూ, యీ గంటా యీ నిమిషం అవనేరదు కదా!

"బొనసుకోండి -" అన్నది రేవతి. "సూటిగా ఉన్న యీ కేసును క్లిష్టంగా చేస్తున్నారు!"

"కాదమ్మాయీ! ... సరే - అయ్యా! తమ సంపాదన ఎంత?" అన్నాడు సాంబమూర్తి.

"ఐదొందలు జీతం -"

"పైరాబడో??"

"దాదాపు ఏమీ లేదు"

"నెలకు ఏడొందలు పంపేవాడు ఆమె మొదటి భర్త. అది చాలుతోందో లేదో నేను చెప్పలేనుకాని అంతకన్నతక్కువక్వాలిటీని అంగీకరించటం సబబని నేను అనుకోను" అన్నాడు సాంబమూర్తి.

"మా మధ్య ప్రేమ ఉన్నది...డబ్బులో తగ్గినా ప్రేమ ఉన్నదే."

"ఓహో! ప్రేమతింటూ కూర్చోవచ్చు!"

నారాయణరావు మొహం వేళ్ళాడేశాడు.

రేవతిమాత్రం నిప్పులు కురిపిస్తూ, "అదేదో మేమిద్దరం చూసుకునే వ్యవహారం - మీ కెందుకూ శ్రమ?" అంది.

"అన్ని వ్యవహారాలూ, చక్కబరచకుండా తీర్మానం చేయటమెలా? సరే - సంపాదన విషయం వొదిలేద్దాం. 'వెరైటీ యీజ్ ది స్పైసిస్ ఆవ్ లైఫ్' అన్నదాంట్లో మీకు నమ్మకమున్నదా?"

ఈ ప్రశ్న ఎవర్ని అడిగాడో తెలియక ఇద్దరూ ఒకేసారిగా "చాలా నమ్మకం!" అన్నారు.

"ఆ విశ్వాసాన్ని రేవతి జీవితంలో ప్రయోగిస్తూన్నది... ఆమె తన భర్తకు వ్రాసిన ఉత్తరాలలో తాను తన యవ్వనాన్ని వినియోగించుకునే విధాల పట్ల ఆయన ఎలాటి అటంకాలూ చెప్పరాదనే ధోరణిని కనబరచింది." అన్నాడు సాంబమూర్తి. సాక్ష్యమేదో తాను సిద్ధంగా వుంచాననే ధోరణిని కనబరిచేట్లుగా ఉత్తరాలు కట్ట బడిన రుమాలును ఆడిస్తూ.

"కావచ్చు -" అన్నది రేవతి.

నారాయణరావు మౌనంగా ఊరుకున్నాడు.

"నేను విశదీకరించవలసిన ముఖ్యవిషయమిది: నా క్లయింట్‌గా నీ తత్వానికి సరిపడే భర్తే నీకు తగినవాడవుతాడు. నీవు ఎన్నుకున్నప్పటికీ, రేపే తిరిగి తెగతెంపులకు పాల్పడకుండా ఉండేట్లుగా నేను కట్టుదిట్టంచేయవలసిన బాధ్యత నాకువున్నది... అందుకని - మిస్టర్ నారాయణరావూ! రేవతి తనయవ్వనానుభవాలను తన ఇష్టానుసారంగా పొందేందుకు మీరు అనుమతించవలసి వుంటుంది. అలాటి ఆమె ప్రవర్తనను ఆమె మొదటి భర్త అంగీకరించాడు కూడాను... అంటే ఆ మొదటి భర్తకన్నా హృదయ వైశాల్యాన్ని మీరు ప్రదర్శించగలిగి వుండాలి. అది మీకు సమ్మతమేనా?" అన్నాడు సాంబమూర్తి.

తాను నోటితో చెప్పలేని విషయాన్ని సాంబమూర్తి విశదీకరించినందుకు రేవతి సంతోషించింది. తన ప్రేమలో తలకిందులుగా పడిపోయిన నారాయణరావు దీనికూడా తప్పక అంగీకరిస్తాడనే ఆమె నమ్మింది. అలాటి అంగీకారాన్ని పొందటం- అందుకు తన లాయర్ సమక్షంలో ఒప్పుకోవటం, తన జీవిత విధానానికి తిరుగులేని అస్త్రంగా వుంటుందని ఆమె తలపోసింది.

ఐతే నారాయణరావు యిబ్బంది పడుతున్న విధంగా కుర్చీలో అటూ యిటూ కదిలాడే కాని జవాబు చెప్పలేకపోయ్యాడు.

"మీ ఇష్టానుసారంగా మీరు వాంఛాతృప్తిని పొందేందుకు బహుశా రేవతికి అభ్యంతరం వుండదు." అని సాంబమూర్తి అందించాడు.

"ఔను.... వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని భంగపరిచే వైవాహికజీవితం నాకు అవసరం లేదు —" అన్నది రేవతి.

---

● నయాగరా జలపాతాన్ని చూడ్డానికి వెళ్ళిన ఒకటూరిస్టుల బృందంలో ఆడవాళ్ళెక్కువగా వున్నారు. అక్కడి గైడ్ ఆ ప్రదేశాన్ని గురించిన వివరాలన్నీ చెబుతూ "ఇది ప్రపంచంలోని గొప్ప జలపాతాల్లో ఒకటి. ఆడవాళ్ళు కాసేపు మాట్లాడకుండా నిశ్శబ్దంగావుంటే దాని హోరు స్పష్టంగా వినవచ్చు" అన్నాడు.

"జవాబివ్వండీ—" అని సాంబమూర్తి తొందర పెట్టాడు.

నారాయణరావు బెదిరిపోయినట్లు కని పించాడు.

"ఈ విషయం లోగడ మనం తేల్చు కున్నదే కదా!" అని రేవతి ఆ పాత విష యాన్ని నారాయణరావుకు జ్ఞాపకంచేసింది.

"ఈ షరతు నేను అంగీకరించను—" అన్నాడు నారాయణరావు - పిరికివాడు తన పిరికితనం బైటపడుతుందేమోనని భయపడి దృఢస్వరాన్ని ప్రయోగించిన విధంగా.

"ఆఁ, అలాగా? ఆరోజున అడిగినప్పుడే మన్నా ఒప్పుకుంటివి....కొన్ని నెలలుగా నన్ను మభ్యపెట్టింది - ఇందుకా?" అని రేవతి కారాలూ మిరియాలూ నూరుతోంది.

సాంబమూర్తి యీ వినోదాన్ని చూసి. విని ఆనందిస్తున్నాడు.

"ఆ ప్రేమలో ఏం చేశానో - నేనిప్పుడు చెప్పలేను. నీతోడి ఆ స్నేహమే నాకు దక్కుదల అని తృప్తిపడగలనని ఇప్పుడు అనిపిస్తోంది. నీ చరిత్రనుగూర్చి ఆలో చిస్తూంటే - నీ విప్పుడు విడాకులివ్వాలను కుంటున్న భర్త దేవుడనిపిస్తోంది: అంత కన్న దైవత్వాన్ని ప్రదర్శించేందుకు దేవుడే మరొక అవతారాన్ని ఎత్తాలి—" అన్నాడు నారాయణరావు.

"అది నిజమేకాని దేవుడు అవతారాన్ని దాల్చేదాకా రేవతి యీ అవతారంలోనే వుండగలదనే నమ్మకం నాకు లేదు!" అన్నాడు సాంబమూర్తి.

నిశ్చయంగా విజయాన్ని ఆశించినవ్యక్తి చిత్తుగా ఓటమిని యెదుర్కోవలసి వచ్చి నప్పుడు ఎలాటిమార్పులు ప్రదర్శితమౌతవో యీ క్షణంలో రేవతినిచూస్తే అర్థమౌతుంది.

"ఇన్ని అబద్ధాలు చెప్పి....ఇంతమోసం చేసి...." అంటోంది రేవతి - కంఠగద్గదల్లో మొహం చేసుకొని:

నారాయణరావు పిల్లివలెనే లేచి. ఆమె దృష్టినుంచి తప్పించుకుంటూజారుకున్నాడు.

"మొగవురుగుల్ని నమ్మకూడదు! ఎన్నెన్ని వాగ్దానాలు - ఎన్నెన్ని ప్రమా ణాలు చేశావ్! నిన్ను నమ్ముకొని కదా నే నింతదూరం వచ్చింది...." కళ్ళనుంచి నీరు కారుతూన్నా గమనించకుండానే ఆమె చెప్పుకొని పోతోంది.

"రేవతీ!" అన్నాడు సాంబమూర్తి హెచ్చరిక చేస్తూన్న ధోరణిలో— "ఆ మోసగాడు - అబద్ధాలకోరు - అమాయకు డల్లే కనిపించే దుష్టుడు పారిపోయ్యాడు!"

ఇప్పుడామె కళ్ళుతుడుచుకొని చుట్టూ చూసి సాంబమూర్తి చెప్పింది నిజమేనని తెలుసుకుంది.

"వాడు వెళ్ళిపోవటమే మంచిది....తీరా పెళ్ళిచేసుకున్నా నిన్ను నానా హింసలూ పెట్టేవాడు. నిన్ను నీ కోర్కెలు తీర్చుకో కుండా అడ్డగించేవాడు....విడాకులు యివ్వ కుండా నానా బాధ పెట్టేవాడు. అంత్య నిష్ఠూరం కన్నా యీ ఆదినిష్ఠూరమే మేలు కదా!"

"మీరు చెప్పినదీ నిజమే!" అన్నది రేవతి తనను తాను ఊరడించుకోగలుగు తూన్నట్లు.


"నీకు విడాకులు రావటం చాలా తేలిక. ఐతే ఆ తరువాత కార్యక్రమాన్ని నిర్ణ యించుకోవటం ఉచితం; మరో కొమ్మపట్టు చిక్కకుండానే, నిలబడినదాన్ని నరుక్కో వటంలాటి పని చేయకూడదుకదా!"

"ఔనౌను—" అని సణిగిందామె.

"నేనొక సలహా చెపుతాను"








"చెప్పండి" అన్నదామె ఆతృతను స్పష్టపరుస్తూ.

"ప్రతిదీ జాతీయం చేయటమనే తీవ్ర జ్వరం దేశమంతటా వ్యాప్తిచెంది ఉన్నది. సమాజంలో సోషలిజాన్ని తీసుకొని వచ్చేం దుకు గాను ప్రతిదాన్ని ప్రజలపరం చేయ టాన్ని చూస్తూనే వున్నాము. ప్రైవేట్ సెక్టర్‌నుంచి పబ్లిక్‌సెక్టర్‌కు సహజంగా మార్పులు తీసుకొని రాబడుతూన్నవి. సౌందర్యం. యవ్వనం మొదలైనవికూడా ఏ ఒక్క వ్యక్తికో చెంది. ప్రైవేట్ సెక్టర్‌లో ఉండటం కన్నా. పబ్లిక్‌సెక్టర్ లోకి గాని రాబడితే సోషలిజమ్ పరాకాష్ఠ నందుకుంటుంది...."

"అందుకని?" అన్నదామె కనుబొమలు ముడివేస్తూ.

"అందుకని—" అన్నాడు సాంబ మూర్తి అర్గ్యుమెంట్లు పూర్తిచేసి అసలు సారాంశాన్ని బైటపెట్టే ధోరణిలో. "ఈ భర్తలను యెదుర్కోటం అదీ మహా యాతన. వీళ్ళల్లో మోసగాళ్ళు జాస్తి. నీ అభిరుచులన్నిటికీ తగినవాడూ. నీ ప్రవర్త నను సర్వదా ఆమోదించేవాడూ దొరకటం దుర్లభం కూడాను. ప్రతిసారీ పెళ్ళిచేసుకో వటం. నచ్చక విడాకులు పుచ్చుకోవటం మొదలైనవి తలనొప్పి వ్యవహారాలు; కాల యాపన. ధనవ్యయంతో కూడినవి ... ఈ గొడవంతా లేకుండా ప్రతిసాయంత్రం ఏ ఫ్యాషనబుల్ రెస్టారెంట్ దగ్గిరో లేదా సినిమాహాలు దగ్గిరో కాపలావేసి. నీకంటికి నచ్చినవాడిమీదికి వాలుచూపులు ప్రసరించా వంటే - ఒకరాత్రి సుఖించి అంతటితో ఆ పురుషుణ్ని వదిలించుకోవచ్చు. 'వెరైటీ ఈజ్ ది స్పైసెస్ ఆఫ్ లైఫ్' అన్నదాన్ని నిత్య జీవితంలో యింతకన్నా గొప్పగా ప్రయోగించే అవకాశం మరి వుండదు. నీ యవ్వనం. అందచందాలూ మొదలైన్వి

మురిగిపోకుండా, నీకు సుఖాన్నిస్తూ ఇతరుల కూడా హాటా యిస్తూ జీవితం హాయిగా, నీకోర్కెలను తీర్చేందుకు అనుగుణంగా సాగిపోతూ వుంటుంది. నీ సౌందర్యానికి దాసులయే మొగాళ్ళు లక్షల కొద్దీ యీ పట్టణంలో లభ్యమౌతారు: ఆ సంగతి నీకూ తెలుసు. పోతే మంచిరేటుకూడా పలుకు తుంది కనుక, నీ సంపాదనా బాగుంటుంది. ఎన్నికలో పొరబడినా, ఒక్కరాత్రి అవస్థే కనుక్క అదేమంత ఇబ్బందిగా వుండదు. మరొకవైపున సెక్స్ సోషలిజంను ప్రయోగాత్మకంగా చూపి, జాతీయం చేయటమనే అత్యున్నత ఆదర్శాన్ని అనుసరించిన దానివీ అవుతావు....

ఎంతో ఆకలైనవాడు పలుగురాళ్ళున్న అన్నమైనా సరే, వాటిని ఏరుకొనే తింటాడు. తీవ్రమైన కోర్కెలను పరిష్కరించుకునేందుకు రెండు మార్గాలున్నవి: ఒకటి దాన్ని అణచివేయగలగటం; ఇది సామాన్యులకు సాధ్యమయేదికాదు. రెండోది - మోహం మొత్తేవరకూ తీర్చుకోవటం. ఈ రెండో పద్ధతి చాలా మందికి సులువైనమార్గం. ముఖ్యంగా నీ ప్రస్తుత పరిస్థితుల్లో నీకు ఎంతగానో ఉపకరిస్తుంది—"

ఆమె వైపు చూడకుండానే తలవొంచుకొని చివరివాక్యాలు అంటున్నాడు సాంబమూర్తి: "నీవు యీ నిశ్చయానికి వచ్చినట్లయితే, ప్రతి ఆదివారము నేను నీతో ఎంగేజ్‌మెంట్ ఇవ్వగలను. ఉదయం పది గంటలకల్లా రాత్రి ఎనిమిదింటికి ఇక్కడికి వస్తున్నావని ముందుగా ఫోన్ చేయాలి. ఎందుకంటే పదకొండింటికి సుశీల ఎంగేజిమెంట్ ఫిక్స్‌చేస్తుంది. ఇద్దరు అమ్మాయిలు నాకు అనవసరం కదా! ... వేనిచ్చే ఫిక్స్‌డ్ రేటు రాత్రికి యాభైరూపాయిలు. రెడీకాష్ బేరం ... నో క్రోకర్స్ ... నెట్ ఎమౌంట్ ....బాగా ఆలోచించుకొని."

హఠాత్తుగా సాంబమూర్తి తలెత్తి చూశాడు. ఆమె గదిదాటుతూవుంది. తన మాటలన్నీ వినే ఉంటుంది. అంతకన్న చెప్పటంకూడా అనవసరం. ఏం నిర్ణయించుకున్నా తనకొచ్చిన ఇబ్బందిలేదు! బాధ్యత తీర్చుకున్నందుకు సాంబమూర్తి తేలిక పడిన విధంగా శబ్దమయేట్లు బిగపట్టిన ఊపిరి వదిలాడు. సువాసనగల గళ్ళరుమాలును ఒక్కసారి వాసన చూశాడు.

● ● ●

మూడు ఆదివారాలు గడిచి పోయినవి. రేవతి వ్యవహారాన్ని గూర్చే మరిచిపోయ్యాడు సాంబమూర్తి. నాలుగో ఆదివారం ఉదయం పదింటికి టెలిఫోన్ మోగింది.

"హలో!" అన్నాడు సాంబమూర్తి.

"హలో - సాంబమూర్తిగారా?"

"ఔను -"

"నేను రేవతి నండీ!"

పిట్ట వలలో పడిందనుకున్నాడు సాంబమూర్తి.

"ఊఁ, ఇవాళ రాత్రి వస్తున్నావా?"

"ఉహుఁ. యీ రాత్రే వెళ్తున్నానండీ!"

"ఎక్కడికి?"

"లండన్ - మా ఆయన దగ్గిరకి వెళ్తున్నాను. రెండు సంవత్సరాల తరువాత కాని మళ్ళీ ఇండియాకురాను ... తమఫీజు సెటిల్ చేద్దామని -"

"నా ఫీజు ఇవ్వలేవులే - అందుకని ఆ సంగతి వదిలేద్దాం"

"మీ ఫీజేమిటో నాకు తెలుసులెండి. మీ సలహా నేను అంగీకరించని కారణాన ఆదివ్వదలచుకోలేదు."

"పర్వాలేదులే!"





"సరే ఉంటానండీ - వ్చ ... ప్చ ..." అని టెలిఫోనులో ముద్దులు పెట్టింది రేవతి.

సాంబమూర్తి తెల్లమొహం వేసి ఒక్క క్షణం ఆ టెలిఫోనును పరిశీలించి. హుక్ మీద పెట్టి తనలో తను నవ్వుకున్నాడు. ఎదురుగా అద్దాల బీరువాలో ఉన్న గళ్ళ సిల్కు రుమాలు వెక్కిరిస్తున్నట్లుగాఉన్నది.

## 4

సన్నగా వాన జల్లు పడుతోంది. చలి చలిగా ఉంది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయం. వాతావరణం ఎంతో ఉత్సాహకరంగా ఉన్నదని ఒప్పుకున్నప్పటికి, సాంబమూర్తి మాత్రం చాలా చికాకుగా ఉన్నాడు.

ఎనిమిదిన్నరకు వస్తానన్న జానకి ఏడున్నరకే ఎందుకు రాకూడదా అని ఆలోచిస్తున్న సమయంలో టెలిఫోనులో ఆమె. తన భర్త హఠాత్తుగా వచ్చాడనీ, కనుక యీ రాత్రికి రాలేననీ ఫోనుచేస్తే - చికాకుగా ఉండదామరి? తనకు టెలిఫోన్ లేకపోయినా బాగుండేది - ఆమె స్వయంగా వచ్చి యీ శుభవార్త చెప్పవలసి వచ్చేది; అప్పుడు ఆ మాటా ఈ మాటా చెపుతూ, ఏమారిచి తన అవసరం [illegible]నేవాడు....అలాకాక్కుండు - టెలిఫోను లేకుం[illegible] యీ రాత్రంతా ఆమె వస్తుందనే ఆశతో వేచి ఉండవలసి వచ్చేది; ఇక్కడిదాకా వచ్చి అసలు సంగతి చెప్పేందుకు సందర్భపడక ఊరుకునేది. ఆటుఠమైనా త్వరలోనే తేలిపోయినందుకన్నా తాను సంతోషించాలి. అసలు అంత తీరిక లేకనే 'మెసేజ్' ఇచ్చి, తాను మాట్లాడే సావకాశం కూడా లేకుండా జానకి ఫోన్ పెట్టేసింది.

చికాగ్గా ఉన్న సమయంలో మళ్ళీ ఫోను మోగింది. జానకి వీలు చేసుకున్నదేమోననే ఆశతో సాంబమూర్తి ఆఫీసు గదిలోకి రెండు అంగల్లో వెళ్ళాడు. ఫోనుగంట మూడో వరస కొడుతూండగా ఫోను ఎత్తాడు. అవతలినుంచి కోకిల కంఠం "హలో -!" అన్నది.

"జానకీ!" అన్నాడు ఆతృతతో. వెంటనే తనతప్పుతెలుసుకున్నాడు. ఆడవాళ్ళందరూ వెనుకనుంచి అందంగా కనిపించినట్లే, వాళ్ళ గొంతులన్నీ టెలిఫోనులో దాదాపు ఒకే మాదిరిగా ఉంటవి.

"సాంబమూర్తిగారా?"

"ఔను....తమరెవరు?" సాంబమూర్తి ఆతృత తగ్గింది. జానకి కాదని తేల్చుకున్నాడు.

"నేను జానకిని కాదండీ .... రేవతిని.... మీకు గుర్తులేదా - రెండేళ్ళక్రితం తమ దగ్గిరికి క్లైయింట్‌గా వచ్చాను...."

"ఆఁ ..ఆఁ. గుర్తున్నది!"

"అన్నట్లు మీరు సుశీలను మార్చి జానకి వలలో పడ్డారా?"

---

● బట్టతల ఆసామీ షాపువాడితో:

"ఈ నూనె వాడితే జుట్టు మళ్ళీ వస్తుందని గ్యారంటీ ఏమిటి?"

"అదేమిటిసార్, అలా అంటారు. పొద్దున ఈ సీసాలోంచి కొంచెం నూనె వాలికి దువ్వెనలమీద పడింది. సాయంత్రానికల్లా అవన్నీ బ్రష్షులై పోయాయి."

ఈ రేవతికి ఎంత గుర్తో!

"వెరైటీ యీజ్ ది స్పైసీస్ ఆఫ్ లైఫ్ కదా"!

"సామెతలు బాగా గుర్తుంచుకున్నారే!"

"ఇండియాకు ఎప్పుడొచ్చావు?"

పది రోజులైందండీ .... బొంబాయిలో వారం ఉండి. ఇవాళ ఉదయమే వచ్చాం."

"సంసారంతోనా?"

"ఔనండీ...మీతోకొంచెం మాట్లాడాలి."

"రేపు ఉదయంరండి."

"ఇప్పుడు తమకోసం ఎవరన్నా అమ్మాయిలు వస్తున్నారా? ఆదివారం ఇలాంటి ఎంగేజ్‌మెంట్‌లు ఉంటవని లోగడ నాకోసారి చెప్పారులెండి - అందుకు అడుగుతున్నా."

"ఉహూఁ. ఎంగేజ్‌మెంట్ కాన్సిలైంది."

"పాపం! మరి నే నిప్పుడురావటానికేం? ఇప్పుడు ఎనిమిదింబావేగా ఐంది. అర గంటలో వచ్చేస్తాను - ఏమంటారూ?"

అంత అర్జెంటు పనేమిటో సాంబమూర్తికి అంతుబట్టలేదు.

"సరే - రా!" అన్నాడు.

అవతల టెలిఫోన్ పెట్టేసిన చప్పుడు విని తనూ టెలిఫోన్ పెట్టేశాడు.

అందాలుచిందే నవయవ్వన రూపంతో రేవతి కళ్ళముందు మరులుగొలుపుతూన్న విధంగా తోచింది సాంబమూర్తికి. ఎదురుగా అద్దాల బీరువాలో గళ్ళ సిల్కురుమాలుతో కట్టబడిన చిన్నమూట కనిపించింది. సాంబమూర్తి ఆమూటవిప్పి ఉత్తరాలను అక్కడే పడేసి గళ్ళరుమాలు చేతిలోకి తీసుకొని వాసన చూశాడు. రెండు సంవత్సరాలైనా దానిమీది సెంటువాసన మైల్డ్‌గా, అహ్లాదకరంగా సువాసనలను విరజిమ్ముతూనే వుంది. చాలా ఖరీదైన విదేశీ తయారై వుండాలి అది!

రాత్రిపూట రేవతి వస్తానంటుంది ఎందుకు? బహుశా తన భర్తనుకూడా వెంటబెట్టుకొని వచ్చి తనకు ధన్యవాదాలు చెప్పేందుకేమో? ఇంత స్వల్పవిషయానికి యీరాత్రి రావాలా? లేక ఆ ధన్యవాదాలేవో టెలిఫోన్ ద్వారానే అందించవచ్చునే!....తన ప్రవర్తనను హేళనచేసే ధోరణిలో ఆమె మాట్లాడింది. మెత్తని చెప్పుతో బెదిరించినట్లు చేసింది.... తెలివిగల జాణ!

వస్తానన్న జానకి రాక చికాకుపడుతూండే తాను ఏదోరకంగా మరో గంటో గంటన్నరో బాధపడి నిద్రపొయ్యేవాడు. మరిచిపోతూన్న దాన్ని జ్ఞాపకం చేసేట్లు పుండుమీద కారం చల్లేట్లుగా యిప్పుడే రేవతి రావటం! తనకు పని వున్నదంటే తీరిపొయ్యేది. ఆమె తనపట్ల చాలా స్వాతంత్ర్యాన్ని తీసుకుంది; అంటే అలాటిదాన్ని తాను అనుమతించాడు. ఇప్పుడు విచారించి లాభంలేదు. ఆ టెంప్టేషన్‌ను ఎదుర్కొని తీరవలసిన దృఢనిశ్చయ మొక్కటే తనకు గతి!

ఆ జేబురుమాలను మొహంమీద కప్పుకొని ఆ సువాసనల్ని ఆఘ్రాణిస్తూ - మెల్లిగా వీచే చల్లగాలికి తనకు తెలియకుండానే మగతనిద్రపట్టింది సాంబమూర్తికి.

ఎవరో మృదువుగా ఆ గళ్ళ సిల్కురుమాలుమీద ముద్దుపెట్టుకోవటం తెలిసి, అదిరిపడి లేచాడు సాంబమూర్తి. ఎదురుగా రేవతి! ఇంకా మత్తుగా పడివున్న శరీరంలోని శక్తులన్నిటినీ ఒక్కుమ్మడిగామేల్కొల్పి కన్నార్పకుండా సాంబమూర్తి ఆమెను పరిశీలించసాగాడు.

రెండేళ్ళు గడచిన ఛాయలు రేవతిలో కనిపించటంలేదు; రెండేళ్ళ వయస్సు తగ్గినట్లుంది. బాగా నునుపెక్కింది. లోటులేని, తృప్తికరమైన జీవితాన్ని గడుపుతూ ఎంతో ఆనందాన్ని తాను అనుభవిస్తున్న ధోరణిని ప్రదర్శిస్తోందామె. ముద్దబంతి పూవల్లే ఎంతో సిమెట్రీవున్న ఆకారం. యవ్వనపు మెరుగులు కన్నులు మిరుమిట్లు గొల్పేట్లుగా ప్రదర్శిత మౌతూన్నవి. ఈ రంభ-ఊర్వశి పనిగట్టుకొని భూమిమీదికి వచ్చి తనలాటి వాళ్ళను ఊరించి, కవ్వించి అందకుండా ఏడిపించట మెందుకో!

జేబురుమాలు తన మొహంమీద అడ్డం వుండగా ఆమె ఒక ముద్దు పెట్టిన విషయం నిశ్చయంగా తనకు తెలుసు. ఆమె ఉద్దేశ్యమేమిటి? లోగడ - రెండేళ్ళక్రితం టెలిఫోనులో పెట్టిన, ముద్దు పద్దులోకే దీన్నికూడా వేయాలా? లేక....పెదవసందేహాలు తీరేదాకా తొందరపడి ప్రయోజనం లేదు.

"అప్పుడే నిద్రపోతున్నారా?" అన్నదామె తేనెలు కురిపించే కంఠస్వరంతో.

"లేదు .... లేదు .... కళ్ళుమూసుకొని కలలు కంటున్నాను!"

"కలలేనా?" అన్నదామె చిలిపిగా.

"నిత్య జీవితంలో లభ్యమవని వాటిని కలల్లోనన్నా అనుభవించకుంటే బతుకులోని నిరాశతో ఆత్మహత్య చేసుకోవలసిన దుస్థితి ఏర్పడుతుంది కదా!"

"ఔనౌను....అందులోనూ జానకి వస్తానని రాలేదు కనుక మరీ బాధ!" ఆమె కళ్ళు విజ్ఞానంతో నిండి మిలమిలా మెరిసిపోతూన్నవి. అవలిస్తే పేగులు లెక్కపెట్టగలిగిన యీమెతో తనేం సమర్థించగలడు? మెదలకుండా ఊరుకున్నాడు.

"లాయర్‌గారూ! ముసలితనం వెంటాడుతున్నా నవయువకునివలె మీ కీ శృంగార వ్యాపకాలేమిటి?" అన్నదామె చిరునవ్వులు చిలకరిస్తూ.

అల్లరి పిల్లవాడితో వాదించి సక్రమ మార్గాన పెట్టేందుకు నిశ్చయించుకున్న తల్లి వలె ఏమిటీ ధోరణి అనిపించిందింది సాంబమూర్తికి.

"మృత్యువు వెన్నాడుతోంది. కనుకనే చకచకా పనులు పూర్తిచేసుకోవాలి. లభ్యమైనంత ఆనందాన్ని పుంజుకోవాలి. ఇక యవ్వనమంటావా - నిలవవున్నా విస్కీలాగు, కాలం గడిచేకొద్దీ పదునెక్కి, అనవసరపు ఉద్రేకాలతో తికమక పడక నిశ్చలంగా, యథారూపాన్ని ప్రదర్శిస్తుంది....సరే....అదంతా నాగొడవ.... నీవు ఒక్కతెవే వచ్చావా?"

"నాకు తోడెందుకండీ? లోగడ ఒకసారి ఆదివారం పదింటికల్లా ఫోను చేయాలన్నారు; లేకుంటే ఎంగేజ్‌మెంట్ సుశీలతో ఫిక్స్ చేసుకోవటం జరుగుతుందనీ, ఇద్దరు అమ్మాయిలు మీకు అనవసరమనికూడా చెప్పారుకదా!"

అబ్బ! ఈమెకు ఎంత జ్ఞాపకం! అసలీమె వచ్చినపనేమిటో ముక్కుకు సూటిగా

---

## రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటినిత్రిప్పిపంపగోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతో పాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని, అట్టివారికి రచనలు త్రిప్పి పంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

— మేనేజింగ్ ఎడిటర్.

అడిగేందుకు సంస్కారం అడ్డొస్తోంది. ఐతే ఒకవిధంగా ఈ యిబ్బంది రాకుండానే ఆమె సూచనగా తెలియపరుస్తూనేవుంది. ఐతే తనకు ధైర్యం చాలటంలేదు.

"మీ బేబీ బాగుందా ?"

"ఫైన్ ! మా సంసారం చాలా సాఫీగా వున్నదండీ యిప్పుడు !"

"సరే - ఏం పనిమీద వచ్చావు ?" అన్నాడు సాంబమూర్తి - ఈ అడ్డదోవలు లాభం లేదనే నిశ్చయంతో.

"మీఫీజు చెల్లిద్దామని వచ్చాను."

సాంబమూర్తి గుండెలో రాయిపడినట్లయింది. తాను ఆశించిన ఫీజేమిటో తానైతే నోటితో చెప్పలేదు; కాని ఆమె తప్పక గ్రహించి ఉంటుందనే నమ్మకం వున్నది. ఐతే యింత హఠాత్తుగా ఆమె చెల్లువేసేందుకు గాను పట్టుకొని వస్తుందనుకోలేదు. అసలు ఈ జన్మలో తాను కోరినరూపంలో అది వసూలౌతుందనీ అనుకోలేదు.

ఒకపక్క సంసార జీవితం హాయిగా వున్నదని చెపుతూ మరోవక్క ఆపాత జీవితాన్ని అనుసరిస్తుందేమిటా అనిపించింది సాంబమూర్తికి. అన్వయం కుదరని రెండు విరుద్ధశక్తులు ఒకే సమయాన, ఒకే తావున నిలవలేవుకదా ! ఒకవేళ ఈమె భర్తను మోసగించి, తనకృతజ్ఞతను క్రియారూపాన వెల్లడించేందుకు వచ్చివుంటే - ఆవేదవ ఉద్రేకంలో తాను ఆశించకూడనిది ఆశించినప్పటికీ, తీరా లభ్యమైనప్పుడు యెలా అంగీకరించగలడు ? ఆ కోవకు చెందిన ప్రవర్తనను యితర స్త్రీలపట్ల తాను సహిస్తున్నప్పటికీ ఈమెపట్లమాత్రం యెన్నటికీ ఓర్చలేడు.

"రేవతీ ! మీ ఆయన యెక్కడున్నారిప్పుడు ?" అన్నాడు సాంబమూర్తి.

"ఇంకా ఇల్లు తీసుకోలేదు . . . గ్రాండు హోటల్లో వున్నాం . . . ఆయన జేబీకి కావలా" ఎంత సాధారణ ధోరణిలో జవాబిచ్చింది !

"ఆయన అక్కడా - నీవేమో రాత్రి షికార్లకు బయలుదేరావన్న మాట !" కోపంతో అరిచాడు సాంబమూర్తి.

"చేసుకున్న భార్యను దబాయించినట్లుంది ధోరణి !" అన్నదామె తాపీగా. "మా ఆయన్ను మోసం చేసి వచ్చాననుకుంటున్నారా ? ఆయన ఆదేశం మీదనేవచ్చాను."

పక్కనే బాంబు పేలినట్లు అదిరిపడ్డాడు సాంబమూర్తి. లోగడ ఆయన వ్రాసిన ఉత్తరాలు చదివి ఎంత విశాల హృదయుడోననుకున్నాడు. ఇప్పుడే విషయం విని ఆ వైశాల్యాన్ని ఊహలో అంచనాలు వేయలేని అసమర్థుడౌతున్నాడు. ఐతే యింత ఉదార స్వభావాన్ని ప్రదర్శించవలసిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో లేదే ! ఏమిటీ విచిత్రం !

"తృప్తికరమైన సంసారజీవనం గడిపే నీకిది తగునా ?" సాంబమూర్తి చాలావరకు చల్లబడి పొయ్యాడు.

"తగదనే అనుకుంటున్నాను. అనేక ఒత్తిడుల కారణంగా చేయరాని పనులు అనేకం చేస్తూనే ఉన్నాము."

"ఇక్కడ ఒత్తిడి ఏముందీ ?"

"ఇంతమాత్రం గ్రహించలేరా ?" అన్నట్లు చూసింది రేవతి.

"మీరు ఫీజును ఏ రూపాన కోరారో నాకు తెలుసు - మీకూ తెలుసు. ఐతే అ రూపాన చెల్లించేందుకు ఆనాడు నేను నిరాకరించాను....ఇక్కడ జరిగిందంతా మా ఆయనకు చెప్పాను—"

"ఎందుకు చెప్పావు ?" అన్నాడు సాంబమూర్తి యిబ్బందిగా కదులుతూ.

"నాయిష్టం. నేనేమన్నా అబద్ధాలు చెప్పానా ? ఆయన్ను మోసంచేయాలని చూశానా ?" అని రేవతి - ఛాలెంజీ చేసే ధోరణిలో అన్నది.

సాంబమూర్తి జవాబు చెప్పలేని నిస్సహాయ స్థితిలో పడ్డాడు.

"ఆ ఫీజు చెల్లించేయమని ఆయన గట్టిగా అన్నారు !" అన్నది రేవతి ఆర్గ్యుమెంట్లను పూర్తిచేసి అసలు సారాంశాన్ని అందించిన ధోరణిలో.

"ఫీజు యీవిధంగా కోరినందుకు నన్నేమీ అనలేదా ?"

"ఉహూఁ. చేసిన చాకిరీకి వెల కోరటమనేది మీ యిష్టంగా ఆయన భావించారు. మొత్తం సంసారనౌక తునాతునకలయే సమయంలో మీరు రక్షించారనీ, యిప్పుడు కొద్ది డామేజ్‌తో నౌక దక్కినా చాలననే అన్నారు—"

సాంబమూర్తికి ఒళ్ళంతా జెర్రులు పాకుతున్నట్లయింది. ఉడుకు నెత్తురంతా గడ్డకట్టుకొని పోతోంది. రేవతి భర్త మహానుభావుడు - అలాటి వ్యక్తికి అపచారం చేయటంకన్న మహాపాపం మరివుండదు !

గచ్చునేలమీద విసిరివేసిన కొత్త టెన్నిస్ బంతివలె సాంబమూర్తి యెగిరి నిలబడ్డాడు.

"రేవతీ ! నాకు ఫీజు అవసరంలేదు. ఒక సంసారాన్ని నిలబెట్టాననే కీర్తికన్న యీ అనుభవం గొప్పది కాదు; కొద్ది డామేజ్‌తో కాకుండా, మీ సంసార నౌకకు ఏ డామేజ్ లేకుండానే కాపాడాననే ఊహ యిచ్చే ఆనందమే నాకు చాలు.... పద - రేవతీ ! నిన్ను హోటల్లో దిగబెట్టి వస్తాను—"

"మా ఆయనకు ఏం చెప్పను ?"

"లాయర్ ఫీజు నిరాకరించాడను.... పద....వర్షం పెద్దదైంది. ఫర్వాలేదు. కారు నేనే డ్రైవ్ చేస్తాను—"

సాంబమూర్తి బట్టలు వేసుకున్నాడు. గళ్ళ సిల్కురుమాలు పక్కమీద పడివున్న దాన్ని జేబులో పెట్టుకున్నాడు. కారు తీసుకొచ్చి వెనుక తలుపు తెరిచాడు. రేవతి వెనుకసీటులో కూర్చుంది. సాంబమూర్తి డ్రైవ్‌చేస్తున్నాడు.

సాంబమూర్తి మనసు మనసులో లేదు. సాధుజనుల్ని తెలియకుండానే బాధపెడుతున్నానేమోననే సందేహంకూడా కలిగింది. దారిలో యెవ్వరూ మాట్లాడలేదు.

హోటల్ముందు కారుఆపి సాంబమూర్తి దిగి వెనుకతలుపు తెరిచాడు. రేవతి కారు దిగి "లోపలికి రండి - మా ఆయన్ను పరిచయం చేస్తాను !" అన్నది.

దివ్యతేజస్సును చూస్తే, సాధారణమైన తన కళ్ళు ఆ వెలుగును తట్టుకోలేక మూడి

---

● పిచ్చాసుపత్రిని చూడ్డానికి వచ్చిన ఒక విజిటర్‌తో డాక్టరు :— ఇదుగో, వీడు తను ప్రేమించిన చిన్నది మరొకణ్ణి ప్రేమించి పెళ్ళిచేసుకుందని తెలిసి ఇలాపిచ్చివాడైపోయాడు. అతనిప్రక్కన వున్నాడే వాడు ఆ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నవాడు.

—నుంకర భాస్కరరావు,
అనకాపల్లి,

పోతవేసేమోననే భయం కలిగింది. సాంబమూర్తికి.

"రేవతీ! జరిగింది మరిచిపో....పీజా రూపాన కోరిన కోరికకు నన్ను క్షమించు.... మీ ఆయన్ని చూడలేను. వస్తాను!" అని సాంబమూర్తి కారు ఇంజన్ ఆన్‌చేశాడు.

రేవతి ఆయనకు నమస్కరించి లోపలికి వెళ్ళేందుకు సిద్ధంగావుంది.

ఇంజన్ మోతలోనే సాంబమూర్తి "రేవతీ! ఒక్కమాట!" అని అరిచాడు.

రేవతి డ్రైవింగ్ సీటుపక్కకు వచ్చింది.

"ఇదిగో - నీ గళ్ళరుమాలు—" అని సాంబమూర్తి రుమాలు అందించాడు.

"నా జ్ఞాపకార్థం మీదగ్గిరే ఉంచుకోండి. ఒక సంసారాన్ని కాపాడిన విషయం మీకీ రుమాలు జ్ఞాపకం చేస్తూవుంటుంది" అన్నది రేవతి.

"థాంక్స్—" అని సాంబమూర్తి కారు పోనిచ్చాడు.

జానకి రానందుకు వికలమైన మనస్సు యిప్పుడు వికసించిన తామరపూవల్లే స్వచ్ఛంగా; పరమ పవిత్రంగా వున్నది. తాను జీవితంలో చేసిన ఘన కార్యానికి బహూకరణగా వచ్చిన గళ్ళసిల్కురుమాలు అంతులేని ఆనందాన్నిస్తోంది. రణరంగంలో రొమ్మిచ్చి పోరాడినందుకు యివ్వబడే విక్టోరియాక్రాస్ లాటిదీ రుమాలు. గర్వంగా రుమాలును వాసనచూస్తూ రోడ్డుమీది నీళ్ళను విరజిమ్ముకుంటూ సాంబమూర్తి శరవేగంతో కారు పోనిచ్చాడు. □□□


# మల్టీకాంప్లెక్సు ఇంజక్షను MULTICOMPLEX

ఇది అశ్వగంధ. అమృత. అభ్రక వస్తుసముదాయముతో తయారింపబడిన అయుర్వేద ఇంజక్షను.

జీర్ణకోశమునకు సంబంధించిన వ్యాధులు:— అనగా అరుచి. నోటిపూత. గొంతుపూత, పేగుకు సంబంధించిన పూత. కడుపుబ్బరము. అమ్లపిత్తము. అతిసారము. శూల మొదలగువానియందు వాడతగినది.

నరములకు సంబంధించిన వ్యాధులు:— అనగా కాళ్ళ చేతుల చివరి భాగములయందు చురుకులు. పోట్లు. తిమ్మెరలు. తలనొప్పి. నిస్త్రాణ. నిశ్శక్తి. దడ. ఆయాసము. నిదురపట్టకపోవుట మొదలగు వానిని అద్భుతముగా నివారించును.

చర్మవ్యాధులు:— దురదతో కూడిన. కూడనటువంటి చర్మవ్యాధులు. పైత్యపు గాదర మొదలగు వానిని రూపుమాపును.


నేత్ర వ్యాధులు:— కండ్ల దురదలు. చూపు మంచగించుట మొదలగు వానియందు వాడతగినది. ఏ వ్యాధినుండియైనను కోలుకున్నవారు బలమునకు. వ్యాధి నిరోధించి శక్తి పెంపొందించుటకును వాడవచ్చును

డోసు:— 1 మి. లి. మొదలు 2 మి. లి. వరకు కండరములోనికి రోజు మార్చి రోజుగాని వైద్యసలహా ననుసరించి యివ్వవలెను.

10 మి. లి. వయల్సులో సప్లయి చేయబడును. — రు. 3-50

ఇండియన్ మెడిసన్ హౌస్
గవర్నరుపేట — విజయవాడ-2.




# మావూళ్లో ఒక్కసారి దిగండి-


ఇట్లు
భమిడిపాటి రామగోపాలం


'విశాలా! అర్జంటుగా అన్నం వొడ్డించు!' అన్నాను, ఇంట్లో అడుగు పెడుతూ, చెప్పులు టేబిలు కిందికి కాళ్ళతోటే విసిరేస్తూ.

'అబ్బా! -అబ్బాఏమిటో, ఆ అర్జంటు పని! ఆఫీసరుగారు క్యాంప్ రమ్మన్నారా?'

'ఛీఛీ ఆఫీసరూ గాదు పాడూ గాదులేవే!- మా నర్సింగరావు లేడూ, అతనొస్తున్నాడు. యివాళ మెయిల్లో.'

'ఎవరండోయి, ఆ నర్సింగరావు?'

'అందర్నీ ఎరిగుండే - ఎవర్నీ ఎరగనట్టు మాట్లాడతావు....నువ్వెరగనంత మాత్రంలో వాళ్లకొచ్చి నష్టమేతేం లేదులే!'

'చూసేరా! - నే నిప్పుడేం అన్నాననీ?' విశాల విశాలంగా నవ్వింది. 'మీకున్న ఫ్రెండ్సు తక్కువమందా? ఓచిన్న రిపబ్లిక్ స్టంట్ సినీమాతియ్యొచ్చు. అందరూ వొచోట పోగైతే. — అంతమందిని ఎంతకని జ్ఞాపకం పెట్టుకోమంటారు?'

'నీకు బోధపరుస్తూ కూచోడానికి నాకు టైమ్‌లేదు. ఇవాళే ఉత్తరం ఒచ్చింది. చూసుకుని,అర్థంచేసుకుని, అన్నంవొడ్డించు. కాళ్ళూ చేతులూ కడుక్కుని ఒచ్చేస్తున్నాను.' అంటూ ఉత్తరం తీసి టేబిల్‌మీద పడేసి పెరట్లోకి నడిచాను.

●

●

నరసింగరావు నా బాల్యమిత్రుడు. కాకినాడలో లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఉత్తమమైన గుణశీలాలున్నాయి; వృత్తిగౌరవంగల వ్యక్తి. పార్టీలనుంచి అనవసరంగా యెక్కువ డబ్బు తీసుకోడు. మనసారా కేసులో న్యాయం వుందని తోస్తే తప్ప కేసు నడిపించడు. మరీ వొళ్ళమంది తనకి న్యాయమే అని తోచేస్తే క్రిమినల్ కేసుల్లాంటివి ఫ్రీగా నడిపించేస్తాడు. అబద్ధపు సాక్ష్యం చెప్తే కోర్టులో శివాలెత్తిపోతాడు. తనపార్టీ అయితే కేసు మధ్యలో విడిచిపెట్టేస్తాడు. 'నాలాంటివాడు లాయర్‌గా